## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని ఎల్.కోట మండల కేంద్రంలోని శ్రావణి కల్యాణ మండపం లో గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి సీతంరాజు సుధాకర్ పరిచయం కార్యక్రమం ఉంటుందని, నియోజకవర్గ పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

### ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన



పాటూరు ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సూర్యనారాయణ

వేపాడ: మండలంలోని సోంపురం, పాటూరు గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీల (చెత్తనుంచి సంపదతయారీ కేంద్రాలు)ను ఈఓపీఆర్డీ సూర్యనారా యణ బుధవారం సందర్శించారు. గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన తడి,పొడి చెత్తను వేరు చేయడం, వర్మీకంపోస్టు తయారీ తదితర అంశాలపై గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

### ధ్యానంతో మానసిక ప్రశాంతత



విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ రామకృష్ణరాజు

బొండపల్లి: రోజూ కొంత సమయం ధ్యానం, యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు అన్నారు. గొట్లాం గ్రామంలోని గాయిత్రీ టెక్నో స్కూల్‌లో విద్యార్థులతో బుధవారం యోగా,ధ్యానం చేయించడంతో పాటు వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రోజూ ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా ధ్యానం, యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడిని జయించవచ్చని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. పిరమిడ్ సేవాదళ్ సీనియర్ మాస్టర్ ఓంప్రకాశ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పెట్రోల్ బంకులో తనిఖీలు



పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వేపాడ: పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పెట్రోల్ బంకులో రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. చమురు నిల్వలకు సంబంధించిన రికార్డులను , తూనిక యంత్రాల పనితీరు, చమురు నాణ్యత, బంకు వద్ద వాహనచోదకుల కోసం తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉన్నదీ లేనిది పరిశీలించారు. వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేశారు. బంకు యజమానికి పలు సూచనలు చేశారు. తనిఖీలు చేసిన అధికారుల్లో సీఎస్‌డీటీ రామకృష్ణ, హెచ్‌డీటీ కె.సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

### వసతిగృహం సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: మండల కేంద్రంలోని సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో మంగళవారం రాత్రి ఎంపీడీఓ ఏ.వేదవతి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థినులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనాలు, అల్పాహారం అందిస్తున్నారా లేదా, ఇతర వసతులపై ఆరా తీశారు. రాత్రి 10 గంటల వరకు ఎంపీడీఓ వసతి గృహంలోనే ఉన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు అన్నీ పక్కాగా అందాలని, మెనూ అమలులో రాజీపడొద్దని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని చెప్పారు.

### పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

దత్తిరాజేరు: మండలంలోని కోరపు కొత్తవలస గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి 26 మీదుగా అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న కంటైనర్‌ను బుధవారం పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు టి.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పంజాబ్‌కు చెందిన సబీర్ ఈశ్వరన్ 30 పశువులను కంటైనర్‌లో తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించి నిందితులపై కేసు నమోదు చేశారు.

# చురుగ్గా అమ్మవారి జాతర ఏర్పాట్లు

- ఈ నెల 26, 27, 28వ తేదీల్లో కనకమహాలక్ష్మి జాతర
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చకచకా పనులు



దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద చేపడుతున్న తాటాకుల పందిరి ఏర్పాటు పనులు

చీపురుపల్లి:

ఉత్తరాంధ్ర ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 26, 27, 28 తేదీల్లో అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. జాతరకు మరో మూడు రోజులు మాత్రమే ఉండడంతో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. మూడు రోజుల జాతరలో భాగంగా ఆదివారం, మంగళవారం రెండు రోజులు లక్షల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇందుకు అనుగుణంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద భారీ తాటాకు పందిరి వేయిస్తున్నారు. గతేడాది వరకు కర్రలతో తాత్కాలిక తాటాకుల పందిరి ఉండేది. కానీ ఈ ఏడాది నుంచి శాశ్వతంగా ఉండేందుకు అవసరమైన ఐరన్ పోల్స్‌తో పనులు చేయిస్తున్నారు. దేవస్థానం ఆవరణలో క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు ఎండ తగలకుండా టెంట్లు వేస్తున్నారు. 24 గంటలూ భక్తులకు తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. జాతరకు వచ్చే యువత, పిల్లలు, పెద్దలు సరదాగా గడిపేందుకు జెయింట్ వీల్స్ ఇతర వినోదయంత్రాలను ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. అలాగే మూడు రోజుల జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు భారీ వేదిక సిద్ధమవుతోంది.



ఆలయ సమీపంలో కొలువుదీరుతున్న జెయింట్ వీల్స్ ఇతర వినోదయంత్రాలు

# వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



శృంగవరపుకోట: దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపులో ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు, భక్తులు

శృంగవరపుకోట: పట్టణంలోని దేవీ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి, వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి, రమాదేవి సహిత సత్యనారాయణస్వామి వార్ల ఆలయం ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండురోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతా మూర్తుల విగ్రహాలకు తొలిరోజు వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు చేసి, ఊరేగించారు. గురువారం వీటిని ప్రతిష్ఠించనున్నారు. దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపులో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు, ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

#### వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ

మెరకముడిదాం: మండలంలోని గర్భాం గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# ఒంటరి విద్యార్థికి ఆర్థిక సహాయం



కామేష్‌కు నగదు అందజేస్తున్న శివప్రసాద్

చీపురుపల్లి: తల్లిదండ్రులు ఇద్దరినీ ఒకేసారి కోల్పోయి ఒంటరిగా మిగిలిన పట్టణానికి చెందిన నీలాతి కామేష్‌కు స్థానిక గాయత్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం రూ.17 వేల ఆర్థిక సహాయం చేశారు. తల్లిదండ్రులను పోగొట్టుకుని అనాథగా మిగిలిన కామేష్‌పై ఈనెల 6న సాక్షి పత్రికలో 'ఒంటరినైపోయాను' శీర్షికతో కథనం వెలువడింది. దీనికి స్పందించిన గాయత్రీ కళాశాల కరెస్పాండెంట్ డి.శివప్రసాద్ విద్యార్థులు కలిసి కామేష్‌కు బుధవారం ఆర్థిక సహాయం చేశారు. కళాశాల కరెస్పాండెంట్ శివప్రసాద్ మాట్లాడుతూ కామేష్ తమ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్నాడని, తల్లిదండ్రులు కోల్పోయి అనాథగా మిగిలిన విషయాన్ని తెలుసుకుని సహాయం చేశామని చెప్పారు. భవిష్యత్‌లో కామేష్ చదువుకు ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని తెలిపారు.

### ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

చీపురుపల్లి: ఓపెన్ స్కూల్ విధానంలో 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు, ఇంటర్మీడియట్ డ్రాపౌట్ విద్యార్థులు, ఫెయిల్ అయిన వారు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

# మందుల పంపిణీపై సంతృప్తి



కొత్తబగ్గాంలో మందుల పంపిణీపై ప్రజలను ఆరా తీస్తున్న వైద్యబృందం

గజపతినగరం రూరల్: ఫైలేరియా (బోదవ్యాధి),నులిపురుగుల నివారణకు సంబంధించిన డీఈసీ, అల్బెండజోల్ మాత్రల పంపిణీపై కేంద్ర వైద్య,ఆరోగ్య బృంద సభ్యులు డాక్టర్ జయరాం, డాక్టర్ నితిన్ సంతృప్తి వ్యక్తం చేశారు. గజపతినగరం మండలంలోని కొత్తబగ్గాంలో ఇంటింటికీ వెళ్లి ఫైలేరియా, నులిపురుగుల నివారణ మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారా లేదా అని ఆరా తీశారు. వైద్య సిబ్బంది మందులు అందజేశారని, వారి సూచనల మేరకు మాత్రలు వేసుకున్నట్లు ప్రజలంతా చెప్పారని అధికారులు తెలిపారు. వారి వెంట డీఎంఓ తులసి, ఏఎంఓ డి.వి.రమణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# ప్రతి పంటనూ ఈ- క్రాప్‌లో నమోదు చేయండి

- రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ ప్రేమ్‌శేఖర్



గజపతినగరం: ఎం.వెంకటాపురంలో మొక్కజొన్న పంట ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ ప్రేమ్‌శేఖర్, తదితరులు



బొండపల్లి: కనిమెరకలో అపరాల పంటకు సంబంధించి ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

గజపతినగరం/ బొండపల్లి: రైతులు సాగుచేస్తున్న పంటలన్నింటి వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని వీఆర్‌ఓలు, వీఏఏలకు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ ఎం.ప్రేమ్‌శేఖర్ సూచించారు. గజపతినగరం మండలంలోని ఎం.వెంకటాపురం, బొండపల్లి మండలం కనిమెరక గ్రామంలో రబీ మొక్కజొన్న, అపరాలు, ఇతర పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు వివరాలను క్షేత్రస్థాయిలో రైతులు, అధికారుల సమక్షంలో బుధవారం ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఎంత విస్తీర్ణంలో, ఏయే పంటలు సాగు చేస్తున్నారన్న విషయాలను రైతులతో పాటు వీఏఏలు, వీఆర్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ -క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ ఈ- క్రాప్ నమోదు చేసుకుంటునే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం వాటిల్లినప్పుడు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని చెప్పారు. మొక్కజొన్న, అపరాల పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలనుకున్నా ఈ-క్రాప్ తప్పనిసరని అన్నారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పథకాలను సద్వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ ప్రకాశ్, గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్, ఏఓలు ధనలక్ష్మి, పి.వి.మల్లికార్జునరావు ఏఈఓ సంతోష్ కుమార్, వీఏఏ నారాయణరావు, వీఆర్‌ఓ రవి పాల్గొన్నారు.

# సమన్వయంతో ఆలయం నిర్మించుకోండి



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎస్ఐ ముకుందరావు

లక్కవరపుకోట: మండలంలోని గనివాడ పంచాయతీ శివారు నిడుగట్టులో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి గ్రామంలో రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తడంతో ఓవర్గం వారు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిరసన తెలిపిన సంగతి విదితమే. ఈ సమస్య పరిష్కారం కోసం ఎస్ఐ ఎం.ముకుందరావు ఇరువర్గాలతో ఆ గ్రామంలో బుధవారం సమావేశమయ్యారు. గ్రామస్తులు అంతా ఐకమత్యంగా ఉండాలని, సమన్వయంతో ఆలయం నిర్మించుకోవాలని సూచించారు. రెండు వర్గాల నుంచి ఆరుగురితో ఒక కమిటీ నియమించుకుని, ఆలయం నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించడంతో గ్రామస్తులు ఏకాభిప్రాయానికి వచ్చారు. భవిష్యత్‌లో ఎలాంటి గొడవలు పడబోమని ఎస్ఐకు గ్రామ పెద్దలు హామీ ఇచ్చారు.

# వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతివ్వండి



ఎన్నికల ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు కోరారు. సీతంరాజు సుధాకర్‌ను గెలిపించా లని కోరుతూ ముద్రించిన ఎన్నికల ప్రచార వాల్‌పోస్టర్లు, కరపత్రికలను గరివిడిలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం వారు ఆవిష్కరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమంతో పాటు అభివృద్ధి, విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించి ప్రభుత్వానికి మరింత మద్దతు తెలపాలని పట్టభద్రులను కోరారు. పీఏసీఎస్‌ల అధ్యక్షులు యలకల అప్పలనాయుడు, లెంక శ్రీరాములు, సర్పంచ్‌లు పొన్నాడ కుమార్,గుడివాడ తమ్మినాయుడు, ఎల్లంటి పోలీస్‌నాయుడు, వలిరెడ్డి లక్ష్మణ పాల్గొన్నారు.

### రూ.10వేల లోపు పెన్షనర్లకు రైస్‌కార్డులు

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగదారులు, వ్యవహారాలు, ఆహారం పౌరసరఫరాల శాఖ విభాగం రిటైర్డ్ ఉద్యోగులు రైస్ కార్డులు పొందేందుకు ఆరు అంచెల ధ్రువీకరణ నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందని మండల సీఎస్‌డీటీ ఎస్.వి.వి.ఎస్.మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.10వేల పెన్షన్ పొందుతున్న ఉద్యోగులు 19,780 మంది ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం, అటువంటి వారు రైస్‌కార్డులు పొందడంలో ఆరు అంచెల ధ్రువీకరణ నుంచి మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. అటువంటి వారు రైస్‌కార్డుల కోసం స్థానిక గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### పారిశుద్ధ్య పనులు



బహిరంగ ప్రదేశంలో చెత్తను తరలించి బ్లీచింగ్ ఫౌడర్ జల్లుతున్న కార్మికులు

గజపతినగరం: స్థానిక పురిటిపెంట న్యూకాలనీ, బాలాజీనగర్ కాలనీలో పంచాయతీ అధికారులు బుధవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలనీల్లోని వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడికలను, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కార్మికులు తొలగించి గ్రామానికి దూరంగా తరలించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. పంచాయతీ సిబ్బంది శర్మ, అప్పలరాజు పనులను పర్యవేక్షించారు.

# ఘనంగా స్కౌట్స్ దినోత్సవం



జాతీయ జంబోరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్కౌట్స్ ,గైడ్స్‌తో ఉపాధ్యాయులు



స్కౌట్స్ పతాకానికి వందనం చేస్తున్న ఉపాధ్యాయులు స్కౌట్స్ విద్యార్థులు

కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రపంచ స్కౌట్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్కౌట్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్-పావెల్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్ పతాకావిష్కరణ చేశా రు. ఈసందర్భంగా అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ బి.పి.ఏ.రాజు మాట్లాడుతూ రాబర్ట్ బాడెన్-పావెల్ జన్మదినాన్ని జన్మదినాన్ని స్కౌట్ డే, పునశ్చరణ (థింకింగ్‌డే) దినోత్సవంగా ప్రపంచమంతా నిర్వహిస్తారని తెలిపారు. స్కౌటింగ్ స్కిల్స్ వివరించారు. అనంతరం స్కౌటింగ్‌లో ఇటీవల ప్రవేశ్ ప్రక్రియ పూర్తిచేసిన విద్యార్థులతో ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే జనవరి 4 నుంచి 10వ తేది వరకు రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించిన 18వ జాతీయ జంబోరీలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ జాతీయ జంబోరీని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించగా, జిల్లా నుంచి 38 మంది పాల్గొన్నారని, అందులో కొత్తవలస హైస్కూల్ నుంచి గైడ్స్ 12 మంది, స్కౌట్స్ ఆరుగురు ఉన్నారని రాజు తెలిపారు. హెచ్ఎం బండారు శ్రీనివాసరావు, స్కౌట్, గైడ్స్ జిల్లా ట్రెనింగ్ కమిషనర్ సీహెచ్.నారాయణమూర్తి, గైడ్ కెప్టెన్ ఏ.కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

# రక్తహీనత నివారణకు కృషి చేయండి



పీహెచ్‌సీలో గర్భిణితో మాట్లాడుతున్న డాక్టర్ సౌజన్యలక్ష్మి

కొత్తవలస: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని ఎనిమియా ముక్తభారత్ కన్సల్టెంట్, డాక్టర్ సౌజన్యలక్ష్మి వైద్యసిబ్బందికి సూచిం చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవలు, హిమోగ్లోబిన్ పరీక్షలను పరిశీలించారు. అలాగే క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది చేస్తున్న హిమోగ్లోబిన్ పరీక్షలు, ఆస్పత్రిల్లో నిర్వహిస్తున్న పరీక్షల శాతాన్ని బేరీజు వేసి లోటుపాట్లను గుర్తించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన మందులు, పౌష్టికాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణులు, బాలింతలు, బాలికలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు ఎం.శృతి, సీతామహాలక్ష్మికి సూచించారు. సీహెచ్‌ఓ కృప, ఎంపీహెచ్‌ఓ వెంకటనాయుడు, సూపర్‌వైజర్లు సూరిదేముడు, బేబీ రాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

### సులభంగా అర్థమయ్యేలా బోధించండి



మాట్లాడుతున్న సీఆర్పీ లత

గజపతినగరం: విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సీఆర్పీ లత సూచించారు. స్థానిక పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఇంగ్లిష్, హిందీ, తెలుగు, గణితం, సైన్స్ పాఠ్యాంశాలను బోధించే విధానాలను వివరించారు. చదవులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారిని కూడా చేసి ఏ-గ్రేడ్ విద్యార్థులుగా తయారు చేయాలని సూచించారు. సీఆర్పీ శ్రీనివాసరావు, మరుపల్లి, గంగచోళ్లపెంట,స్థానిక బాలికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫర్నీచర్, మరుగుదొడ్ల మంజూరుకు హామీ



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి లలిత

జామి: స్థానిక శాఖా గ్రంథాలయానికి ఫర్నీచర్, మరుగుదొడ్లు మంజూరు చేస్తున్నట్లు గ్రంథాలయశాఖ కార్యదర్శి ఎన్.లలిత తెలిపారు. స్థానిక గ్రంథాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించి, పాఠకులతో మాట్లాడి వారి అభిప్రాయా లు తెలుసుకున్నారు. గ్రంథాలయంలో మరుగుదొడ్లు, తగినంత ఫర్నీచర్ లేదని గుర్తించి త్వరలో మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే అవసరమైన పుస్తకాలను సరఫరా చేస్తామని తెలిపారు. ఆమె వెంట లైబ్రేరియన్ మేరీ నిర్మల ఉన్నారు.

# లక్ష్మీ గణపతికి ప్రత్యేక పూజలు



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు అవనాపు విక్రమ్, తదితరులు

విజయనగరం: పట్టణంలోని తూర్పు బలిజివీధిలో కొలువైన లక్ష్మీగణపతి ఆలయంలో 28వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ, కోరిన కోర్కెలు తీర్చే స్వామిని ప్రతిఒక్కరూ దర్శించి, తరించాలన్నారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ కె.తవిటిరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయన నారాయణరావు, కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# వేసవి నేస్తాలు...



కొత్తవలస మండల కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు



అరకు-విశాఖ రోడ్డులో తాటి ముంజులు విక్రయిస్తున్న మహిళ

కొత్తవలస: వేసవి ఎండల తీవ్రత ప్రారంభమైంది. వేసవి తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలు, ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. వేసవిలో చల్లదనం కోసం ప్రజలు ఎక్కువగా వినియోగించే వాటిలో పుచ్చకాయలు, తాటి ముంజులకు ప్రథమ స్థానం ఉంటుంది. దీన్ని గుర్తించిన వ్యాపారులు పుచ్చకాయల అమ్మకాలను విరివిగా చేపడుతున్నారు. పక్క జిల్లాలతో పాటు ఏలూరు ప్రాంత నుంచి పుచ్చకాయలను తెచ్చి రోడ్లపక్కన దుకాణాలు పెట్టి విక్రయిస్తున్నారు. మరోవైపు గీతకార్మికులు తాటికాయలను రోడ్డపక్క కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారు. అరకు- విశాఖ రోడ్డులో పర్యాటకులు తాటిముంజులు కొనేందుకు ఎగబడుతున్నారు.